అమరజీవిని ఆదర్శంగా తీసుకోవాలి

-పొట్టి శ్రీరాములు త్యాగం మరువలేనిది
- కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్

విశాలాంధ్ర- శ్రీకాకుళం : అమరజీవి పొట్టి శ్రీరాములును ఆదర్శంగా తీసుకోవాలని జిల్లా కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ పిలుపునిచ్చారు. బుధవారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా కలెక్టరెట్ ఆవరణలో పోలీసుల గౌరవ వందనం స్వీకరించి, జాతీయ జెండాను ఆవిష్కరించిన అనంతరం, పొట్టి శ్రీరాములు చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘన నివాళు లర్పించారు. అక్కడ నుంచి అధికారులతో కలసి పాత బస్టాండ్ కూడలికి చేరుకుని అక్కడ పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి ఆయన ఘనంగా నివాళులర్పించారు. ఈసందర్భంగా కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ మాట్లాడుతూ మద్రాసు రాష్ట్రం నుండి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏర్పాటు చేయాలని పొట్టి శ్రీరాములు రెండు నెలల పాటు ఉపవాస ఉంటూ దీక్ష చేయగా కేంద్ర ప్రభుత్వం భాషా ప్రయుక్తంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని విభజించిందన్నారు. ఆయన చేసిన ప్రాణ త్యాగం వలన ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిందన్నారు. ఆయన త్యాగాన్ని స్మరించుకునే విధంగా నెల్లూరు జిల్లాకు పొట్టి శ్రీరాములు పేరును పెట్టారని గుర్తు చేశారు. త్యాగధనుల స్ఫూర్తితో అధికారులు ప్రజలకు ఉత్తమమైన సేవలు అందించాలన్నారు. వారిని ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగుదామన్నారు. ఆయన త్యాగాలను మరువలేనివని, ఆయన ఆశయాలను కొనసాగిద్దామన్నారు. ఈ కార్యక్రమంలో సహాయ కలెక్టర్ రాఘువేంద్ర మీనా, డిఆర్ఓ ఎం.గణపతి రావు, ఆర్డీఓ సి.హెచ్ రంగయ్య, జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి కె చెన్నకేశవరవు, జిల్లా ఖజానా శాఖ అధికారి రవికుమార్, కలెక్టరెట్ ఏవో రాజేశ్వరరావు, మున్సిపల్ కమిషనర్ చల్లా ఓబులేషు, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర బార్ కౌన్సిల్ తీరు అన్యాయం

- తప్పుపట్టిన న్యాయవాదులు
- రూ.20 సంక్షేమనిధి స్టాంపు రుసుం రద్దు చేయాలి
- నినదించిన శ్రీకాకుళం న్యాయవాదులు

విశాలాంధ్ర-శ్రీకాకుళం : సంక్షేమనిధి స్టాంపు రుసుం పెంపును తక్షణం ఉపసంహరించా లని శ్రీకాకుళం జిల్లా బార్ అసోసియేషన్ న్యాయ వాదులు డిమాండ్ చేశారు. బుధవారం వారు జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ ఎన్ని సూర్యారావు ఆధ్వర్యంలో రాష్ట్ర బార్ కౌన్సిల్ తీరును తప్పుబడుతూ నిరసన కార్యక్రమం నిర్వహించారు ఇటీవల పెంచిన రూ.20 స్టాంపు రుసుం రద్దు చేయాలని కోరారు. న్యాయవాదులకు చెల్లించే ఆరోగ్య ఖర్చులకు పరిహారం, మరణానంతరం న్యాయవాదుల కుటుంబ సభ్యులకు చెల్లించే బీమా మొత్తం పెంచకుండా రాష్ట్ర బార్ కౌన్సిల్ రూ.20 సంక్షేమ నిధి స్టాంపు రుసుం వసూలు చేయడాన్ని వారు వ్యతిరేకించారు. రాష్ట్ర బార్ కౌన్సిల్ చైర్మన్, సభ్యులు ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకుని పేద, మధ్య తరగతి వర్గాలకు చెందిన న్యాయవాదులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని రాష్ట్ర బార్ కౌన్సిల్ తన పద్ధతి మార్చుకోవాలన్నారు. రాష్ట్ర బార్ కౌన్సిల్ ఏకపక్ష నిర్ణయాలు నిరసిస్తూ రెండో విడత విధుల బహిష్కరణ చేస్తున్నామని తెలిపారు. న్యాయవాదుల సంక్షేమ నిధి మొత్తాన్ని రూ.20 లక్షలకు పెంచిన తర్వాతే సంక్షేమ నిధి స్టాంపు రుసుం పెంచాలన్నారు. రాష్ట్ర బార్ కౌన్సిల్ ఆదాయం వ్యయం వంటి వివరాలను ప్రతి నెల విడుదల చేయాలని కోరారు. విధుల బహిష్కరణ గురు, శుక్రవారాల్లో కొనసాగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ బీసీ న్యాయవాదుల సంఘం అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు, ఆగూరు ఉమా మహేశ్వర రావు, చౌదరి లక్ష్మణ రావు, బార్ అసోసియేషన్ కార్యదర్శి, పొన్నాడ రాము, న్యాయవాదులు, పి మల్లిబాబు, డి. ఈశ్వర రావు, బి. సుదర్శన్, ఎస్. వేణు గోపాల రావు, ఐ.సీతరాజు, ఎస్. శంకర్ రావు, తంగి వాసు, అంబటి ప్రకాష్ రావు, సూర అప్పల నాయుడు, ఆనంద రావు, మహిళా న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రవ్యాప్త విద్యాసంస్థల బంద్‌ను జయప్రదం చేయండి

ప్రజా సంఘాల నాయకుల పిలుపు

విశాలాంధ్ర-టెక్కలి : విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ ఆపాలని, కడపలో ఉక్కు పరిశ్రమ నిర్మించాలని అన్ని విద్యార్థి, యువజన సంఘాల, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఈనెల 8వ తేదీన జరిగే రాష్ట్ర వ్యాప్త విద్యాసంస్థల బంద్‌లో ప్రతి ఒక్కరూ పాల్గొని జయప్రదం చేయాలని ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కొన్న శ్రీనివాసరావు, ఎస్ఎఫ్ఐ మండల నాయకులు దుర్గాప్రసాద్, కాంగ్రెస్ పార్టీ నాయకులు కోట మధుసూదనరావు, జనసేన నాయకులు అవినాష్‌లు కోరారు. టెక్కలి మండల కేంద్రంలో బుధవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రత్యక్షంగా, పరోక్షంగా లక్షలాది మందికి ఉపాధి అవకాశాలను కల్పిస్తుందని, ఉద్యమాలతో, బలిదానాలతో విశాఖ ఉక్కు సాధించుకోవడం జరిగిందని గుర్తు చేశారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కార్పొరేట్లకు ఊడిగం చేసేలా వ్యవహరిస్తున్నాయి అని ఆరోపించారు. ప్రభుత్వ రంగ సంస్థగా ఉన్న విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణను చేసేందుకు ఎత్తుగడలను మానుకోవాలని

హితవు పలికారు. ఈ నేపథ్యంలో నవంబర్ 8వ తేదీన ఉక్కు పరిశ్రమ పరిరక్షణకు, ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కడపలో ఉక్కు ఫ్యాక్టరీ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ రాష్ట్రవ్యాప్త విద్యాసంస్థల బంద్‌ను నిర్వహిస్తున్నామని ప్రతిఒక్కరూ ఈబంద్‌ను విజయవంతం చేయాలని కోరారు.

హామీలన్నీ అమలుచేసిన ఘనత సీఎం జగన్ దే : మంత్రి ధర్మాన ప్రసాదరావు

విశాలాంధ్ర-గార : ఎన్నికల ముందు ఇచ్చిన హామీలన్నీ అధికారంలోకి వచ్చిన తర్వాత అమలు చేసిన ఘనత సీఎం జగన్మోహన్ రెడ్డిదేనని రాష్ట్ర రెవిన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. గార మండలంలోని వాడాడ పంచాయతీలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని స్థానిక సర్పంచ్ సురేష్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గడపగడపకు వెళ్లి పలు సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అందిస్తున్న ప్రభుత్వ పథకాలకు సంబందించిన కరపత్రాలను ప్రజలకు పంపిణీ చేశారు. అనంతరం గ్రామంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ధర్మాన ప్రసాదరావు మాట్లాడారు. రాష్ట్రంలో అత్యున్నతమైన పారదర్శక పాలన సాగుతుందన్నారు. ఆర్థిక, సామాజిక రంగాలలో అభివృద్ధి చెందేందుకు చదువు ఒక్కటే మార్గం అని ప్రభుత్వం నమ్ముతుందన్నారు. అందుకోసమే విద్యా రంగానికి పెద్ద ఎత్తున నిధుల కేటాయింపు అన్నది చేసినట్టు తెలిపారు. రాజకీయాలు, పార్టీలకతీతంగా అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అందిస్తున్నారన్నారు. రానున్న ఎన్నికల్లో మళ్లీ సీఎంగా జగన్మోహన్ రెడ్డినే నిలబెట్టాలని ప్రజలను కోరారు. ప్రతిపక్షాల మాటలను ప్రజలు నమ్మే స్థితిలో లేరని, అభివృద్ధి, సంక్షేమం గురించి జగన్మోహన్ క్షేత్ర స్థాయిలో నిరూపించారన్నారు. అవినీతి అనేది రాష్ట్రంలో ఎక్కడా లేదన్నారు. ప్రజల జీవితాల్లో మార్పు తీసుకుని వచ్చి, ధనవంతుల పిల్లల్లా పేదపిల్లలకు మంచి విద్యను అందిస్తుంటే ప్రతిపక్షం పార్టీలు తట్టుకోలేక పోతున్నాయన్నారు. టీడీపీ వారు అధికారం ఉన్నన్ని రోజు పేదలకు ఏమీ చేయలేదని, మంచి చేస్తున్న జగన్ ప్రభుత్వం పై ఏడుస్తున్నారని మంత్రి ధర్మాన ఏద్దేవా చేసారు. ఈ కార్యక్రమంలో యువనేత ధర్మాన రామ్మనోహర్ నాయుడు, వైకాపా నాయకులు పీస గోపి, గొండు కృష్ణమూర్తి, గొండు, రఘురాం, శ్రీశయన కార్పొరేషన్ చైర్మన్ డిపి దేవ్, రాష్ట్ర నాటక అకాడమీ డైరెక్టర్ ముంజేటి కృష్ణమూర్తి, జిల్లా విద్యార్థి విభాగంఅధ్యక్షులు మార్పు పృథ్వీ, పీసా శ్రీహరి, వైస్ ఎంపీపీ అరవల రామకృష్ణ, అంధవరపుబాలకృష్ణ, స్థానిక నాయకులు తేజ, అప్పలనాయుడు, చింతనిప్పులు దాసు, కంచు రవి,అధికారులు తదితరులు పాల్గొన్నారు.

కంటి ఆపరేషన్‌కు కోర్టు అనుమతిస్తే సంబరాలా!

-వైసీపీ ప్రచార విభాగం జోనల్ ఇన్చార్జి
చింతాడ రవికుమార్

విశాలాంధ్ర-ఆమదాలవలస : కంటి కాటరాక్ట్ సర్జరీ కోసం చంద్రబాబుకు తాత్కాలిక బెయిల్ హైకోర్ట్ మంజూరు చేస్తే దానికి తెదేపా సంబరాలు చేసుకోవటం హాస్యాస్పదంగా ఉందని వైయస్సార్‌సీపి ప్రచార విభాగం జోనల్ ఇన్చార్జి చింతాడ రవికుమార్ అన్నారు. బుధవారం ఆమదాలవలసలో గల జగనన్న ప్రజాసేవా కార్యాలయంలో విలేకర్ల మాట్లాడుతూ చంద్ర బాబుకు హైకోర్టు కేవలం కంటి ఆపరేషన్ కోసం తాత్కాలిక బెయిల్ మంజూరు చేసిందని,

ఆరోగ్యం సరిగా లేదని ఎవరు కోర్టుకు విన్న వించుకున్నా వారికి కోర్టు బెయిల్ మంజూరు చేస్తుందని, ఢిల్లీ రాష్ట్రమంత్రి సత్యేంద్ర, లాలూ ప్రసాద్ యదవ్, వరవరరావు లాంటి వారికి కూడా ఆరోగ్య సమస్యలు ఉన్నాయని కోర్టుకు విన్నవించగా వారికి కూడా ఇదే విధమైన బెయిల్ మంజూరు చేసిందని రవికుమార్ అన్నారు. తొందరలో ఇంకొన్ని కేసులు కూడా చంద్రబాబు మెడకు చుట్టుకుంటాయని, మరలా చంద్రబాబు జైలుకెళ్ళడం ఖాయమని రవికుమార్ పునరుద్ఘాటించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు ముద్దాడ ఈశ్వరరావు, దానేటి రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

చిరుధాన్యాలలో మేలైన పంటలపై శిక్షణ

కెవికె శాస్త్రవేత్త డాక్టర్ రమేష్ నాయక్

విశాలాంధ్ర-ఆమదాలవలస : చిరుధాన్యాలు విలువ ఆధారిత పంటలపై రైతులు అవగాహన కలిగి ఉండాలని, మేలైన రకాలను ఎంపిక చేసి అధి కోత్పత్తులు సాధించాలని హైదరాబాద్‌కు చెందిన సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ రమేష్ నాయక్ అన్నారు. కృషి విజ్ఞాన కేంద్రం ఆమదాల వలసలో చిరుధాన్యాలలో మేలైన పంటల యాజమాన్య పద్ధతులు, విలువ ఆధారిత ఉత్పత్తులపై మూడు రోజులు శిక్షణ కార్యక్రమం హరిజన ఉపప్రణాళిక పథకంలో ప్రారంభించారు. ఈకార్యక్రమానికి జాతీయ వ్యవసాయ పరిశోధన నిర్వహణ సంస్థ, హైదరాబాద్ కు చెందిన సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్.ఎం.రమేష్ నాయక్ ముఖ్యఅతిథిగా విచ్చేసి, కార్యక్రమంలో మాట్లా డుతూ రైతులకు చిరుధాన్యాల ప్రాముఖ్యతను తెలియజేసి ఈ శిక్షణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని వెల్లడించారు. కృషి విజ్ఞాన కేంద్రం సమన్వయకర్త డాక్టర్. కే.భాగ్యలక్ష్మి మాట్లాడుతూ కేవీకే ద్వారా గిరిజన ప్రాంత రైతులకు చిరుధాన్యాలతో చేసిన విలువ దారిత ఉత్పత్తుల తయారీపై శిక్షణనిచ్చి, స్వయం ఉపాధి కలిగేలా ప్రోత్సహిస్తున్నా మని వివరించారు. డాక్టర్ పి.వి.సత్య నారాయణ వ్యవసాయ పరిశోధన స్థానా ధిపతి, రాగోలు మాట్లాడుతూ మారుతున్న ఆహారపు అలవాట్లు, జీవనశైలికి చిరుధాన్యాలు వినియోగం చాలా అవసరమని వెల్లడించారు. చిరుధాన్యాలలో మాంస కృతులు, పీచు పదార్థాలు, కాల్షియం, మిన రల్స్, అధికంగా ఉంటాయని, రక్త హీనతను తగ్గిస్తాయని తెలిపారు. రైతులు చిరుధాన్యాలు ఉత్పత్తి, ఉత్పాదికతను పెంచే యాజమాన్య పద్ధతులను పాటించాలని సూచించారు. డాక్టర్. ఏ.రామచంద్ర ఆత్మ, ప్రాజెక్టు డైరెక్టర్ మాట్లాడుతూ చిరు ధాన్యాలు ఉపయోగించడం వలన ఆరోగ్యానికి మేలు చేకూరుతుందని, అందువలన రైతులు సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి అధిక దిగుబడులను పొందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. 2023 సంవత్సరాన్ని చిరు ధాన్యా లు సంవత్సరంగా ప్రకటించడం జరిగిందని తెలిపారు. కె.వెంకటరమణ వ్యవసాయశాఖ సహాయ సంచాలకులు, మాట్లాడుతూ శ్రీకాకుళం జిల్లాలో రబీ పంట కాలంలో 3000 హెక్టార్ల వరకు చిరుధాన్యాలైన రాగి, కొర్ర, సామ పండించడం జరుగుతుందని తెలియజేశారు. పంట విస్తీర్ణం రెట్టింపు చేసుకోవ దానికి వ్యవసాయ శాఖ సీడ్ ప్రాసెసింగ్ యూనిట్ సబ్సిడీపై రైతులకు అందజేయడం జరుగుతుందని తెలియ జేశారు. ఈకార్యక్రమంలో కెవికె శాస్త్రవేత్తలు నేలవేణి, బాలకృష్ణ, హరికుమార్, సునీత, కిరణ్‌కుమార్, మౌనిక, శిల్ప, పుష్ప, మూర్తి, అభ్యుదయ రైతు బీ.వీ.రమణమూర్తి మరియు కెవికె దత్తత గ్రామాల నుండి షెడ్యూల్ కుల రైతులు పాల్గొన్నారు.

ఇళ్లు కాదు ఊళ్లు నిర్మిస్తున్నాం

రాష్ట్ర రెవెన్యూ శాఖా మంత్రి ధర్మాన

విశాలాంధ్ర-శ్రీకాకుళం రూరల్: ఇవాళ ఇల్లు లేనివారికి స్థలం కేటాయించి, ఇంత కాలం నిస్సహాయులుగా ఉన్నవారికి అండగా నిలిచి వారికి పక్కా ఇళ్లు నిర్మించి ఇస్తున్నామని, ఇదంతా జగన్ ప్రభుత్వం కారణంగానే సాధ్యమౌతుందని రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. సింగుపురం పంచాయతీ కి చెందిన 40 మంది లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలను తన క్యాంప్ కార్యాలయంలో పంపిణీ చేసి, సంబంధిత వర్గాలకు శుభాకాంక్షలు చెప్పారు. ఇవాళ మౌలిక సదుపాయాలు కల్పించి జగనన్న కాలనీలను పూర్తిచేసి ఇస్తున్నామని తెలిపారు. వీటిని అర్హులైన వారంతా అందుకోవాలని, అలానే స్వాతంత్ర్యం వచ్చిన తరువాత ఇన్నేళ్లకు పేదల ఇంటి కలలను సాకారం చేసిన ఘనత ఈ ప్రభుత్వానికే చెల్లిందని, ఈ విషయాన్ని

లబ్ధిదారులంతా గుర్తు పెట్టుకోవాలని అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా యజ్ఞంలా చేపడుతున్న ఇంటి నిర్మాణాలకి ఎక్కువ నిధులు కేటాయించి, వాటి పూర్తికి ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నామని, ముఖ్యంగా పెద్ద ఎత్తున్న ప్రయివేటు భూమిని కొనుగోలు చేసిన ఘనత కూడా సీఎం వైఎస్ జగన్ నేతృత్వాన నడుస్తున్న సర్కారుకే చెల్లుతుందని అన్నారు.

సంకల్పం దేనినైనా సాధించేలా చేస్తుంది : ఎంపీపీ ప్రతినిధి

విశాలాంధ్ర-మెళియాపుట్టి : సంకల్పంతో ముందుకు సాగితే దేన్నైనా సాధించవచ్చునని తెలియజేస్తు స్వర్గీయ పొట్టి శ్రీరాములు మొక్కవోని దీక్ష చేసి నాడు రాష్ట్ర అవతరణకు ప్రాణత్యాగం చేసిన గొప్ప మహనీయుడని ఎంపీపీ ప్రతినిధి ఉదయ్ కుమార్ అన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో కార్యాలయంలో అమరజీవి పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలువేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ప్రతినిధి ఉదయ్ కుమార్ తో పాటు ఎంపీడీవో చంద్రకుమారి, వైసీపీ నాయకులు ఉర్లాన బాలరాజు, జైమినిరావు, ఏవో తిరుపతి పట్నాయక్, ఈవోపీఆర్డీ తారకేశ్వరి, గణపతి రావు, ఎంఈఓ ఎస్. దేవేందర్ రావు, రెండవ ఎంఈఓ పద్మనాభరావు, ఏపీఎం లలిత, మురళి, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

పలాసలో భారీ కొండచిలువ హల్‌చల్

విశాలాంధ్ర-పలాస : పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధి నర్సిపురం గ్రామంలో సుమారు పది అడుగులు పొడవుగల భారీ కొండచిలువ హల్ చల్ చేసింది. బుధవారం ఉదయం పొదల్లో దాగివున్న కొండ చిలువను స్థానికులు గమనించారు. అప్పటికే భారీగా ఆహారం తీసుకుని ఎటు వెళ్లలేని కొండచిలువను చూసి స్థానికులు భయాందోళన చెందారు. విషయం తెలుసుకున్న అటవీ శాఖ అధికారులు కొండచిలువను లోకేష్ అనే వ్యక్తి చేతితో పట్టి సంచిలో వేసి పట్టణానికి దూరంగా విడిచిపెట్టారు. దీంతో ఆ ప్రాంత వాసులు ఊపిరిపీల్చుకున్నారు.

వంశధార శివారు ఆయకట్టుకు నీరు విడుదల చేయాలి

విశాలాంధ్ర-వజ్రపుకొత్తూరు : వంశధార ఎడమ కాలువ 60 ఆర్ఎల్ ఛానల్‌కు సాగునీరు విడుదలచేసి శివారు రైతులను ఆదుకోవాలని జనసేన నియోజకవర్గం నాయకుడు డాక్టర్ వి. దుర్గారావు బుధవారం డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీకాంత్ ను కలిసి విన్నవించారు. ఈ కాలువకు 600 క్యూసెక్కుల నీరు విడుదల చేయాల్సి ఉండగా వంతులవారీగా 50 క్యూసెక్కులు మాత్రమే విడుదల చేస్తున్నారు అన్నారు. ఆలస్యం గా ఉబా జరిగిన పొలాలు ప్రస్తుతం పొట్ట దశలో ఉన్నాయని, ఈ సమయంలో నీరు విడుదల చేస్తే 50 శాతం పంట చేతికి అందే అవకాశం ఉందని వివరించారు. ఆయనతో పాటు కీలు రాజారావు, తమ్మినాన తారకేశ్వరరావు, కీలు బాలరాజు, నర్సింగరావు, ధర్మారావు ఉన్నారు.

పెద్దపులి దాడిలో ఆవు, గేదె, దూడ మృతి

విశాలాంధ్ర-కవిటీ : ఉద్దాన ప్రాంతంలో పెద్ద పులి సంచారం స్థానికులకు భయాందోళనకు గురిచేస్తుంది.గత ఐదు రోజులుగా కవిటి మండలంలో పులి సంచరిస్తుంది. మంగళవారం రాత్రి పలు గ్రామాల్లో ఆవులు గేదెలపై దాడి చేసింది. మండలంలోని సహలాల పుట్టుగలో పాడి రైతు మామిడి కొయిరయ్యకు చెందిన పాడి ఆవు,కొండి పుట్టుగలో గేదె దూడపై పులి దాడి చేయడంతో అవి మృతి చెందాయి.కవిటి ఎస్సై కే రాము,అటవీ శాఖ అధికారులు ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు.

పెద్దపులి సంచరిస్తుంది ప్రజల అప్రమత్తంగా ఉండాలి

విశాలాంధ్ర-కవిటీ : మండలంలో పలు గ్రామాలలో పెద్దపులి సంచరిస్తుందని మండల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కవిటి ఎస్సై కే రాము సూచించారు. ఈ సందర్భంగా ఎస్సై రాము మాట్లాడుతూ మండలంలో పలు గ్రామాలలో పాడి పసువులపై మంగళవారం రాత్రి దాడి చేసిందని, ప్రజలు ఒంటరిగా ఆరుబయట తిరగరాదని సూచించారు.

రాజకీయ పార్టీల విజ్ఞప్తుల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలి : డీఆర్ఓ

విశాలాంధ్ర-శ్రీకాకుళం : గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల విజ్ఞప్తులను క్షుణ్ణంగా పరిశీలించి వాటిని త్వరగా పరిష్కరించాలని జిలా రెవిన్యూ అధికారి ఎం. గణపతిరావు అన్నారు. ప్రతివారం జరుగుతున్న రాజకీయ పార్టీల సమీక్ష సమావేశంలో భాగంగా 16వ వారపు సమావేశాన్ని డిఆర్ఓ తన ఛాంబర్‌లో బుధవారం సాయంత్రం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన గుర్తింపు పొందిన పార్టీలు అందజేసిన పలు వినతులపై పై విధంగా స్పందించారు. భారత్ ఎలక్ట్రికల్ లిమిటెడ్ ఇంజనీర్ల పర్యవేక్షణలో జరుగుతున్న బ్యాలెట్ యూనిట్లు, వివి ప్యాడ్, కంట్రోల్ యూనిట్ల ముదింపు ప్రక్రియను గురించి వివరించారు. దాదాపు 70 శాతానికి పైగా వాటి పనితీరును పరిశీలించామని, రెండు మూడు శాతం పరికరాలు సాంకేతికంగా విఫలమైనట్లు గుర్తించామని వాటిని ప్రక్రియ నుంచి తొలగించినట్లు పేర్కొన్నారు. అలాగే జిల్లాకు చేరిన కొత్త పరికరాలతో పాటు మిగిలిన వాటిని కూడా గడువులోగా పరిశీలిస్తామని వివరించారు. ఈ నెలలో బూత్ లెవెల్ స్థాయిలో జరగనున్న ముసాయిదా ఓటర్ల జాబితా పై అభ్యంతరాల స్వీకరణ కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్ల గురించి చెప్పారు. ఇప్పటికే జిల్లాలో పెండింగ్లో ఉన్న 27 వేల క్లెయిమ్ల పరిష్కారానికి జిల్లా కలెక్టర్ సూచనల మేరకు చర్యలు తీసుకున్నట్లు వివరించారు. నవంబర్ 4,5 అలాగే డిసెంబర్ 2, 3వ తేదీలలో ఆయా పోలింగ్ కేంద్రాలలో బూత్ లెవెల్ అధికారులతో ప్రత్యేక క్యాంపులు నిర్వహిస్తున్న దృష్ట్యా ఆయా కేంద్రాలలో ఎన్నికల విధులకు సంబంధించిన అధికారుల ఫోన్ నెంబర్లతో కూడిన జాబితాను స్పష్టంగా కనిపించేలా ఉంచాలని ఆదేశించారు. కార్యక్రమంలో రాజకీయ పార్టీల ప్రతినిధులు రౌతు శంకర్రావు (వైఎస్ఆర్సిపి), పీఎంజే బాబు (టిడిపి), చల్లా వెంకటేశ్వరరావు (బిజెపి), సోమేశ్వరరావు (బీఎస్పీ) హాజరయ్యారు.

ఘనంగా ఆంధ్ర రాష్ట్ర అవతరణ దినోత్సవం

విశాలాంధ్ర-కవిటి : మండలంలోని లండారిపుట్టుగ సచివాలయంలో ఆంధ్ర రాష్ట్ర అవతరణ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంఎల్‌సి నర్తు రామారావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీపీ కడియాల పద్మతో కలసి పొట్టి శ్రీరాములు చిత్ర పటానికి పూలమాలలువేసి ఆంధ్ర రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్సీ రామారావు మాట్లాడుతూ ఉమ్మడి మద్రాస్ రాష్ట్రం నుంచి విడిపోయి1953, అక్టోబర్ 1న ఆంధ్ర రాష్ట్రం అవతరించగా 1956 నవంబర్ 1న హైదరాబాద్ రాష్ట్రం విలీనం కావడంతో ఆంధ్ర రాష్ట్రం కాస్తా ఆంధ్రప్రదేశ్‌గా మారిందని అన్నారు. ఈ మేరకు దేశంలో తొలి భాషా ప్రయుక్త రాష్ట్రంగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ గుర్తింపు పొందిందని అన్నారు.ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మన్మధరావు, సచివాలయం సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

శ్రీకళ్యాణి ఇంగ్లీష్ మీడియం స్కూల్ ప్రాంగణంలో ప్రిన్సిపాల్ పండి బిందు మాధవి ఆధ్వర్యంలో ఆంధ్ర రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు ఆంధ్రప్రదేశ్ నమూనాలో ఆకృతిలో బీటీ ఆశ్రిత తెలుగు తల్లిగాను, కేవరుణ్ పొట్టి శ్రీరాములు వేషధారణలో అందరినీ ఆకట్టుకున్నారు. అనంతరం విద్యార్థులకు ఉపాధ్యాయులు ఆంధ్ర రాష్ట్ర అవతరణ దాని గూర్చి పొట్టి శ్రీరాములు చేసిన శాఖ ఫలం పొట్టి శ్రీరాములు చేసిన సత్యాపగ్రహం గూర్చి విద్యార్థులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అంబేద్కర్ విగ్రహాన్ని మంత్రి డా.సీధిరి ఆవిష్కరణ

విశాలాంధ్ర-పలాస : పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని 31వ వార్డు సీతారామనగర్‌లో డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని రాష్ట్ర మత్స్య, పశుసంవర్ధకశాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి అప్పలరాజు మాట్లాడుతూ రాజ్యాంగ నిర్మాత అట్టడుగు వర్గాలవారి అభ్యున్నతికి కృషి చేసిన మహనీయుడు అంబేద్కర్ అని అన్నారు. అంబేద్కర్ అట్టడుగున వారికి రిజర్వేషన్ కల్పించినప్పటికీ అన్ని వర్గాల వారికి మేలు చేసిన ఎన్నో సంస్కరణలు చేపట్టడంతో నేడు అంబేద్కర్ అందరివాడిగా నిలిచారని అయన విగ్రహం ఈ ప్రాంతంలో నెలకొల్పడం గొప్ప విషయమని అన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్లు మీసాల సురేష్ బాబు, బోర బుజ్జి, కౌన్సిలర్లు, వైకాపా నాయకులు, దళిత సంఘాల నాయకులు పాల్గొన్నారు.

కె.టి. రోడ్ పనులు శరవేగంగా పూర్తి చేయాలి

మంత్రి డా. సీధిరి అప్పలరాజు

విశాలాంధ్ర-పలాస : పలాస కెటిరోడ్ పనులు శరవేగంగా చేపట్టి త్వరలో పూర్తి చేయాలని రాష్ట్ర మత్స్య, పశుసంవర్ధకశాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు గుత్తేదారుడు మెదలవలస మన్మధరావుకు ఆదేశించారు. ఆదివారం కెటిరోడ్ విస్తరణ పనులు చివరి దశకు చేరుకొని తారురోడ్డు నిర్మాణం పనులు జరుగుతున్న నేపద్యంలో మంత్రి అప్పలరాజు పనుల తీరును పరిశీలించారు. నిర్మాణ పనులకు ఎటువంటి అడ్డంకులు ఉన్నా వాటిని తక్షణమే తొలిగించి శరవేగంగా పనులు చేపట్టాలని ఇప్పటికే నిర్మాణ పనులు ఆలస్యం కావడంతో వ్యాపారులు ఇబ్బందులు పడిన మాట వాస్తమేనయినప్పటికీ ఈ పనులు కొద్ది రోజులలోనే పూర్తి చేసి కెటిరోడ్‌ను సుందరంగా తీర్చిదిద్దడం జరుగుతుందన్నారు. ఈ పరిశీలనలో ఆయనతో పాటు కౌన్సిలర్లు, వైకాపా నాయకులు, మున్సిపల్ ఇంజినీరింగ్ అధికారులు సునీల్ కుమార్, ఎఇ అవినాష్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులు సేవలు మువలేనివి : సర్పంచ్ భూషణ్ రెడ్డి

విశాలాంధ్ర-సంతబొమ్మాళి : సంతబొమ్మాళి మండలం నరసాపురం గ్రామం ఎంపియు పిఎస్ పాఠశాల ఈ పాఠశాలలో సుమారుగా 10 సంవత్సరములు పనిచేసి ఇటీవల బదిలీపై ఇతర పాటశాలకు వెళ్లిన కానూరు ఆనందరావు, జయలక్ష్మి టీచర్‌ల సేవలు మరువలేనివని. నర్సాపురం పంచాయితి సర్పంచ్ దుక్క భూషణ్ రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా ఆ ఇద్దరి. ఉపాధ్యాయులకు ఘనంగా శాలువాలు, పూలమాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులుకు విద్యతో పాటు, క్రమశిక్షణ నేర్పించారు అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం గోవిందరాజు, ప్రభావతి మేడం, రాజు మాస్టర్, ఉపాధ్యాయులు మరియు గ్రామ పెద్దలు పోతన్ రెడ్డి, పాల్ గుణ అంగన్వాడి సిబ్బంది పాల్గొన్నారు.

అమరజీవి త్యాగాలు మరువలేనివి

విశాలాంధ్ర-ఆమదాలవలస : పొట్టి శ్రీరాములు త్యాగఫలంతో పాటు అనేక మంది పోరాట ఫలితంతో ఏర్పాటైన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం మనందరికీ స్ఫూర్తిదాయకం అని, ఆయన త్యాగాలు మరువలేనివని మున్సిపల్ కమిషనర్ రవి సుధాకర్ అన్నారు. రైల్వే స్టేషన్ కూడలి వద్ద పొట్టి శ్రీరాములు విగ్రహానికి బుధవారం పూలమాలవేసి నివాళులు అర్పించారు. రాష్ట్రం ఏర్పాటుకు ఆయన చేసిన త్యాగం చిరస్మరణీయమన్నారు. ఆంధ్ర రాష్ట్రం ఏర్పాటు కోసం తృణప్రాయంగా ప్రాణాలు ధారపోసిన అమరజీవి పొట్టి శ్రీరాములుకు నీరాజనాలు తెలిపారు. అమరజీవి త్యాగాలను ప్రతి ఒక్కరూ గుర్తించాలన్నారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ లక్ష్మీనారాయణ, టి పి ఎస్ హెచ్ వి సత్యనారాయణ, ఏఈ బి సృజన, ఆర్ ఐ డి రామారావు తదితరులు పాల్గొని నివాళులర్పించారు.

ఆసుపత్రి వద్ద పింఛన్ పంపిణీ

విశాలాంధ్ర-ఇచ్ఛాపురం : మున్సిపాలిటీ పురుషోత్తపురం సచివాలయం పరిధిలోని ఇద్దరు మహిళలు విశాఖపట్టణంలో క్యాన్సర్ చికిత్స తీసుకుంటుండగా వారికి నెలవారి ప్రభుత్వ సామాజిక పింఛన్‌ను వారి వద్దకే వెళ్ళి అందించారు. 1వ వార్డుకు చెందిన సుగుణ, 2వ వార్డుకు చెందిన నెయ్యల దమయంతి నోటి క్యాన్సర్ వ్యాధితో పినాకిల్ హాస్పిటల్లో వైద్య సహాయాన్ని పొందుతున్నారు. పురుషోత్తపురం సచివాలయం వలంటీర్ కొనతాల దివాకర్ వైజాగ్ వెళ్లి వాళ్లకు పెన్షన్ అందజేసాడు. అందుకు అతన్ని 1వ వార్డు కౌన్సిలర్ సుగ్గు ప్రేమ్ కుమార్, ఎంఎల్ఓ సందీప్‌లు అభినందించారు.

టిడిపి మేనిఫెస్టో పథకాలు గూర్చి ఇంటింటికి వివరించండి

- మాజీ ఎంపీపీలు రామక్రిష్ణ, కామేశ్వరరావు

విశాలాంధ్ర-కోటబొమ్మాళి : తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వస్తే ఏపి సంక్షేమ పథకాలు అందజేస్తామన్నది ఇంటింటికి వెళ్ళి వివరించి 2024లో టిడిపికి గెలిపించమని చెప్పాలని మాజీ ఎంపీపీలు తర్ర రామక్రిష్ణ, వెలమల విజయలక్ష్మి కామమేశ్వరరావులు అన్నారు. బుధవారం స్థానిక తెలుగుదేశం కార్యాలయంలో కోటబొమ్మాళి మండల టీడీపీ ముఖ్య నాయకులు, క్లస్టర్, యూనిట్, బూత్ ఇన్‌ఛార్జిలతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో వీరు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టిడిపి రాష్ట్ర అధ్యక్షుడు, టెక్కలి శాసన సభ్యులు కింజరాపు అచ్చెన్నాయుడు ఆదేశాలమేరకు భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమం ద్వారా ప్రతిఒక్కరు వారి పరిధిలో ఉన్న ఇళ్లకు వెళ్లి పార్టీ అందించిన సర్టిఫికేట్లు, వాల్ స్టిక్కర్లు అంటించి, టిడిపి అందించబోతున్న సంక్షేమ పథకాలు వివరించి, టిడిపికి ఓటువేసి గెలిపించాలని ప్రతి ఓటర్లు కోరాలని వారు సూచించారు. అలాగే వైకాపా ప్రభుత్వం పడుతున్న ఇబ్బందులు, ధరలను ఓటరు వివరించి, మళ్లి వైకాపాకు ఓటువేస్తే రాష్ట్రం నాశనం అవుతుందుని ఓటరుకు అర్థం అయ్యేవిధంగా చెప్పాలని వారు సూచించారు. అంతకు ముందు చంద్రబాబు జైలు నుంచి బయటకు వచ్చిన సందర్భంగా అమ్మవారికి మాజీ ఎంపీపీ వెలమల విజయలక్ష్మి, కామేశ్వరరావు ప్రత్యేక పూజలు నిర్వహించి భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం ప్రారంభించి పలువురు ఓటర్లుకు కలిసి సంక్షేమ పథకాలు గూర్చి వివరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి శ్రేణులు నంబాళ్ళ శ్రీనివాస్, గొందు లక్ష్మణరావు, సాసుమంతు ఆనందరావు, దేవాది సింహాద్రమ్మ, కోరాడ గోవిందరావు, లాడి శ్రీనివాస్, వెంకటేష్, వాన లక్ష్మి, బెండి అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

నిజం గెలిచిందని కాదు... కంటి ఆపరేషన్‌కే బెయిల్

- నాలుగు వారాల తర్వాత చంద్రబాబు మళ్ళీ జైలుకెళ్ళాల్సిందే...
- దీనికి కూడా టిడిపి నేతలు సంబరాలు చేసుకోవడం హాస్యాస్పదం
- ఎంపీపీ ఉమామల్లేశ్వరరావు

విశాలాంధ్ర-కోటబొమ్మాళి: చంద్రబాబుకు కంటి ఆపరేషన్ కోసం హైకోర్టు నాలుగు వారాలపాటు తాత్కాలిక బెయిల్ ఇస్తే.. టీడీపీ నేతలు న్యాయం గెలిచిందంటూ హంగామా చేయటం హాస్యాస్పదంగా ఉందని మండల పరిషత్ అధ్యక్షుడు రోణంకి ఉమామల్లేశ్వరరావు అన్నారు. ఆయన బుధవారం స్థానిక విలేకర్లుతో మాట్లాడుతూ చంద్రబాబు కంటి ఆపరేషన్‌కోసం నాలుగు వారాలు హైకోర్టు బెయిల్ ఇస్తే స్థానిక టీడీపీ నాయకులు ఏదో సత్యం, ధర్మం, న్యాయం గెలిచి చంద్రబాబు బయటకు వచ్చినట్లు బాణాసంచి పేల్చి, ర్యాలీలు నిర్వహించి సంబరాలు చెసుకున్నారని, నిజం, సత్యం, ధర్మం గెలిచి చంద్రబాబు బయటకు రాలేదనే విషయాన్ని టీడీపీ నేతలు గుర్తుంచుకోవాలని ఆయన సూచించారు. చంద్రబాబుకు తాత్కాలిక బెయిల్ వస్తే.. లోకేష్ యుద్ధం మొదలైందని హెచ్చరించడం హాస్యాస్పదంగా ఉందన్నారు. చంద్రబాబకు ఇచ్చిన షరతులతో కూడిన బెయిల్‌కే టిడిపి సంబరాలు చేసుకుంటుందని ఎద్దేవా చేశారు. టిడిపి నాయకులు చేస్తున్న పిచ్చి శ్చేష్టలను ప్రజలు చూస్తున్నారని, మీరు ఎన్నిచేసినా ప్రజలు టీడీపీ నమ్మరని ఈ విషయాన్ని టిడిపి శ్రేణులు గుర్తుంచుకోవాలని అన్నారు. ప్రజలంతా జగన్‌మోహన్‌రెడ్డికి పాలనకు అలవాటు పడ్డారని ఇక జన్మభూమి కమిటీల పాలనవైపు చూరని ఆయన జోష్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కళింగ కర్పోరేషన్ డైరెక్టర్ సంపతిరావు హేమసుందరరాజు, మండల విప్ బొద్దు అప్పన్న, వైకాపా నాయకులు హనుమంతు తేజ, సింగుపురం వినోద్, రాము తదితరులు ఉన్నారు.

ఆదివారం జీ తెలుగు కుటుంబం అవార్డ్స్ పార్ట్-2

విశాలాంధ్ర-శ్రీకాకుళం : జీ తెలుగు కుటుంబం అవార్డ్స్ పార్ట్ 2 ఆదివారం జీ ఛానెల్ లో ప్రసారం కానుందని ఆ ఛానెల్ ప్రతినిధి చెప్పారు. అతిథిగా పాల్గొన్న ఆర్జీవీ సీరియల్స్, జీ తెలుగు కుటుంబంపై ప్రశంసలు కురిపించారని, నేచురల్ హీరో నాని రాకతో కార్యక్రమం మరింత సరదాగా మారిందన్నారు. ప్రముఖ యాంకర్ సుమ, రాజీవ్ కనకాల తమ 25వ వివాహ వార్షికోత్సవాన్ని ఈ అవార్డు వేదికపైనే జరుపుకున్నారన్నారు. వీరి ప్రేమ కథకు ప్రేక్షకులు ఆనందంతో ఉబ్బితబ్బిబ్బయ్యారని, ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేసేలా ద్రౌపదిగా నయని నటన, రష్మీ, కావ్య కళ్యాణ్‌రామ్‌ల అద్భుతమైన ప్రదర్శనతో ప్రేక్షకులను ఉర్రూతలూగించా రన్నారు. ఉత్తమ యాంకర్, ఎవర్ గ్రీన్ కపుల్, పాపులర్ మేల్ ఫేస్ వంటి అవార్డులతో పాటు మరిన్ని అవార్డులతో నటీనటులను జీ తెలుగు సత్కరించిందన్నారు. సరదాగా సాగిన ఈ కార్యక్రమానికి బుల్లితెర నటీనటులతోపాటు టాలీవుడ్ తారలు, ప్రముఖులు హాజరై మరింత కళను జోడించారని, నవంబర్ 5న సాయంత్రం 6 గంటలకు జీ తెలుగులో ప్రసారమయ్యే జీ కుటుంబం అవార్డ్స్ పార్ట్-2లో అంగరంగ వైభవంగా సాగిన ఈ కార్యక్రమంలో ప్రముఖ సినీ తారలు సంయుక్త మీనన్, సుహాస్, పాయల్ రాజ్‌పుత్, తరుణ్ భాస్కర్ తదితరులు పాల్గొన్నారని తెలిపారు.

సహాయం చేసే గుణం అలవర్చుకోవాలి

విశాలాంధ్ర-శ్రీకాకుళం టౌన్ : మనకు ఉన్నంతలో పదిమందికి సాయం చేయడంలో కలిగే ఆనందం చెప్పలేనిదని జిల్లా ఎన్టీఆర్ ఫ్యాన్స్ అసోసియేషన్ అధ్యక్షులు దుంగ శ్రీధర్ పేర్కొన్నారు. బుధవారం స్థానిక శ్రీకాకుళం నగరంలో గల ఏపీ హెచ్ బి కాలనీలోని బెహరా మనోవికాస్ కేంద్రంలో గురుగుబెల్లి శ్రీనివాసరావు జన్మదినం వేడుక ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా కేంద్రంలో గల మానసిక చిన్నారులకు ఉదయం అల్పాహారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్ ఫ్యాన్స్ జిల్లా అధ్యక్షులు దుంగ శ్రీధర్ మాట్లాడుతూ బెహరా మనోవికాస్ కేంద్రంలో తమ అసోసియేషన్ తరపున అనేక కార్యక్రమాలు చేపట్టామని, నేడు ఎన్టీఆర్ అభిమాని శ్రీనివాసరావు జన్మదిన సందర్భంగా ఇక్కడున్న 84 మంది చిన్నారులకు అల్పాహారాన్ని ఏర్పాటు చేశామన్నారు. నందమూరి కళ్యాణ్ రామ్ ఫ్యాన్స్ జిల్లా అధ్యక్షులు బి మధు మాట్లాడుతూ పుట్టినరోజున ఆర్భాటాలకు వెళ్లకుండా శ్రీనివాసరావు ఓమంచి కార్యక్రమాన్ని నిర్వహించడం అభినంద నీయమన్నారు. శ్రీనివాసరావు మాట్లాడుతూ బెహరా మనోవికాస్ కేంద్రానికి ఇకపై తన వంతు సహాయ సహకారాలు అందజేయనున్నట్లు తెలిపారు. కేంద్రం నిర్వాహకురాలు బెహరా శ్యామల ఈ సందర్భంగా వారికి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం శ్రీనివాసరావు రిమ్స్ ఆసుపత్రిలో రోగులకు పండ్లు రొట్టెలు పంపిణీ చేశారు. పలువురికి ఆహారాన్ని అందజేశారు.

పకడ్బందీగా ఓటరు జాబితా సరిచూడాలి : తహశీల్దారు సరోజిని

విశాలాంధ్ర-మెళియాపుట్టి : పకడ్బందీగా ఓటరు జాబితా తనిఖీ చేసి సరిచూడాలని తహశీల్దారు సరోజిని అన్నారు. బుధవారం నాడు స్థానిక తహశీల్దారు కార్యాలయంలో బిఎల్‌ఓలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె ముందుగా పోలింగ్ కేంద్రాల వారిగా ఓటర్ల జాబితా వివరాలను బిఎల్‌ఓలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రతి పోలింగు కేంద్ర పరిధిలో ఓటరు జాబితా వివరాలను పకడ్బందీగా తనిఖీలు నిర్వహించి ఒకటికి రెండుసార్లు సరిచూసుకోవాలన్నారు. ముఖ్యంగా ఫారం 6, 7లను పక్కాగా చూడడంతో పాటుగా సున్నా ఉన్నా ఇంటి నెంబర్లను సైతం నిసితంగా సరి చూసుకోవాలన్నారు. ఈ సమావేశంలో తహసిల్దార్ తో పాటు డిప్యూటీ తహసిల్దార్ శంకర్ రావు, ఆర్ఐ వైకుంఠ రావు, బిఎల్‌ఓలు తదితరులున్నారు.

ప్రభుత్వ పాలనను ఎండగడతాం

: మజాలేని నవరత్నాల పథకాలు
: జనసేన నియోజకవర్గస్థాయి సమావేశంలో నాయకుల మండిపాటు

విశాలాంధ్ర-పోలాకి : ప్రజా వ్యతిరేకపాలనతో కొనసాగుతున్న వైఎస్‌ఆర్సిపి ప్రభుత్వ పాలనను ఎండగడతామని జనసేన నియోజకవర్గం స్థాయి నాయకులు మండిపడ్డారు. బుధవారం మండలంలోగల గుప్పెడుపేటలో జరిగిన జనసేన నియోజకవర్గస్థాయి సమావేశంలో నాయకులు మాట్లాడారు. పార్టీ మండల నాయకులు నందు పల్లి దండాసి మాట్లాడుతూ నవరత్నాలు పథకాలతో ప్రజలను మభ్యపెడుతున్నారని పథకాల పేరుతో దోచుకుంటున్నారని ఆరోపించారు. నవరత్నాలు పథకంలో పాలకులు ఏమి చెప్పారని నేడు ఏంచేస్తున్నారని ప్రశ్నించారు. మద్యపానం నిషేధం చేస్తామంటూ చెప్పిన ప్రభుత్వం నేడు ఆదాయం కోసం మధ్యమే ఆధారంగా మలుచుకున్నారన్నారు. యువతకు ఉద్యోగాలు లేక పరిశ్రమలు రాక మనోవేదనకు యువత గురైందన్నారు. నిర్మాణాలు చేపట్టకపోవడంతో కార్మికులకు పని లేకుండా పోయిందన్నారు. ప్రభుత్వ వ్యతిరేక పాలనను ఇంటింటా ప్రచారం చేస్తామన్నారు చంద్రబాబు బెయిలు శుభపరిణామని అన్నారు. పార్టీ నాయకులు పవన్ కళ్యాణ్ ప్రజా సంక్షేమం కోసం కృషిచేస్తున్నట్లు చెప్పారు. 2024వ సంవత్సరంలో జిల్లాలో 10 నియోజకవర్గాల్లో టిడిపి కూటమితో విజయం కోసం తీవ్రంగా కృషి చేస్తున్నట్లు చెప్పారు. రామరాజ్యం స్థాపన జనసేన పార్టీ లక్ష్యమని అన్నారు. నరసన్నపేట పార్టీ అధ్యక్షులు బలగ ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ జిల్లాస్థాయిలో సమన్వయ కమిటీ ఏర్పాటు జరిగినట్లు చెప్పారు. ఎటువంటి విభేదాలు లేకుండా వైఎస్‌ఆర్సిపి దాష్టిక పాలనను ఎండగడతామని అన్నారు. వైసిపి పాలన నుంచి విముక్తి కలిగించుటకు ప్రజలు ఎదురుచూస్తున్నట్లు చెప్పారు. అందుకు టిడిపి పార్టీతో పనిచేయుటకు తమ పార్టీ సిద్ధంగా ఉన్నట్లు చెప్పారు. ఎన్నికల్లో నరసన్నపేట నియోజకవర్గం తెలుగుదేశం కూటమి విజయకేతనం ఎగరవేస్తున్నట్లు చెప్పారు. పార్టీ సిద్ధాంతాలు ధ్యేయంగా పనిచేస్తున్న జన సైనికులు వీర మహిళలుతో ప్రజా వ్యతిరేక పాలనను అన్ని గ్రామాల్లో ప్రచారం చేస్తామన్నారు. సారవకోట పార్టీ మండల అధ్యక్షులు బస్సుల పృద్వి మాట్లాడుతూ కేంద్రంతో కుటిల రాజకీయాలు జరుపుతున్న వైఎస్‌ఆర్సిపి రైల్వే జోను పై మౌనం వహిస్తుందన్నారు. ఉద్యోగులు లేక రాష్ట్ర సంపద ఏమైనట్లుని ప్రశ్నించారు. ఇసుకలో దోపిడీ చేస్తూ ఆదాయ మార్గాలు లేక ఉపాధి అవకాశాలు సృష్టించలేక రేపు ప్రజలపై భారాలు మోపించే ప్రభుత్వముగా ప్రజలు భావిస్తారని చెప్పారు. చంద్రబాబు అరెస్టును దేశస్థాయిలో నాయకులు ఖండించారని ఇటువంటి దుష్ట పాలనను ప్రజలు వ్యతిరేకించాలని కోరారు. అందుకు జనసేన పార్టీ విద్య వైద్యం ఉపాధి వంటి అవకాశాల కోసం మేనిఫెస్టో స్పష్టంగా తయారు చేస్తున్నట్లు చెప్పారు. జనసేన వీర మహిళ లావేటి బుజ్జమ్మ మాట్లాడుతూ మహిళపై ఇన్ని దాడులు జరుగుతున్న ప్రభుత్వం స్పందించడం లేదని మద్యం మత్తులో ప్రభుత్వం తూగుతుందని ఆరోపించారు. కార్యక్రమంలో అల్ల నాగు పైడి సునీల్ గుట్ట హరి రుక్కు శ్రీరామ్ మూర్తి మంద సూర్య పుక్కల్ల సత్యం తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత విద్యార్జనకు బ్యాంకు సహకారం అందిస్తుంది

బ్యాంక్ మేనేజర్ వెంకట అవినాష్

విశాలాంధ్ర-మెలియాపుట్టి : విద్యార్థులు విద్యార్జన సమయంలో ఒక లక్ష్యాన్ని ఏర్పాటు చేసుకొని ప్రణాళిక యుతంగా ముందుకు సాగి ఉన్నత విద్యభ్యాసం కొరకు బ్యాంకు లోన్ సౌకర్యం కల్పిస్తుందని టెక్కలి కెనరా బ్యాంక్ మేనేజర్ టి. వెంకటఅవినాష్ తెలిపారు. గ్రామాలలో ఉన్న విద్యార్థులు తమ కుటుంబ ఆర్థిక పరిస్థితి దృశ్య, ఉన్నత చదువులు చదివే అవకాశం లేకుండా చదువు మధ్యలో ఆపేసి పరిస్థితులు చాలా దగ్గరలో ఉన్నాయని, అయితే అటువంటి పరిస్థితుల్లో ఉన్న కుటుంబలకి చెందిన విద్యార్థులు ఉన్నత విద్య చదివేందుకు తమ బ్యాంకు ద్వారా కెనరా బ్యాంక్ విద్య జ్యోతి స్కీమ్ ద్వారా లోన్ సౌకర్యం కల్పించడం జరుగుతుందన్నారు. బుధవారం నాడు మెలియాపుట్టి మండలం గొడ్డ ప్రాథమిక పాఠశాలలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అనేక అంశాలపై విద్యార్థుల, విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడుతు అవగాహన కల్పించారు. అనంతరం నిరుపేద విద్యార్థులకు ఐదవ క్లాస్ చదువుతున్న పెద్దబొంతు సుమిత్ర సేనబిందు, ఆరవ క్లాసుకు చెందిన మాడంగి శామాశ్రి , 7వ క్లాసు చదువుతున్న పోతూరి దీక్షితలకు ఒక్కొక్కరికి 2500 చొప్పున, 8వ తరగతి చదువుతున్న పడాల ధనం, 9వ తరగతి చదువుతున్న కోరాడ యామిని, పదవ తరగతి చదువుతున్న కోరాడ లిఖితలకు ఒక్కొక్కరికి ఐదు వేల రూపాయలు చొప్పున స్కాలర్ షిప్ లను అందించారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు మేనేజర్ వెంకటఅవినాష్ తో పాటు సర్పంచ్ ప్రతినిధి ఆదిలక్ష్మి అప్పారావు, వీఆర్వో శామ్యూల్, కార్యదర్శి వనజాక్షి, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్తులు తదితరులున్నారు.

వంశధార శివారు దుస్థితి పాపం శివాజీ, అచ్చన్నలది!

మంత్రి అప్పలరాజుపై నోరు జారితే ఖబద్దార్
వైసీపీ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్

విశాలాంధ్ర-వజ్రపుకొత్తూరు : యార్లగడ్డ శిరీష నోరు అదుపులో పెట్టుకో..పలాస నియోజక వర్గంను అభివృద్ధి పథంలో నడిపిస్తున్న మంత్రి డాక్టర్ అప్పలరాజుపై అవాకులు చవాకులతో నోరు పారేసుకుంటే ఖబద్దార్ అని వైసీపీ జిల్లా ఉపాధ్యక్షుడు పాలిన శ్రీనివాస్ హెచ్చరించారు. బుధవారం పూండిలో వైసీపీ నాయకులతో కలిసి విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంట నష్టం ప్రాంతంలో పర్యటన అంటూ హడావుడి చేస్తున్న టీడీపీ నాయకురాలు శిరీష లిఫ్ట్ ఇరిగేషన్‌లు కడుతుంటే మౌనం వహించిన తన తండ్రి గౌతు శివాజీ, వంశధారపై అనధికార లిఫ్ట్‌లు కట్టిన అప్పటి మంత్రి అచ్చెన్నాయుడులను ఎందుకు నీలదీయలేదని ప్రశ్నించారు. అనధికార లిఫ్ట్‌లు కడుతుంటే అడ్డుకోకుండా అప్పటి ఎమ్మెల్యే శివాజీ గాడిదలు కాసారా అని అన్నారు. ఈ ప్రాంత అభివృద్ధి ప్రధాత మంత్రి డా.అప్పలరాజును ప్రజలు కోరుకుంటున్నారని, 2024లో రాష్ట్రం లోనే అత్యధిక మెజారిటీతో గెలుపించుకోడానికి నియోజకవర్గం ప్రజలు సిద్ధంగా ఉన్నారని అన్నారు. కిడ్నీ బాధితుల కోసం రూ. 50 కోట్లతో సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి, రూ. 700 కోట్లతో శుద్ధిజల ప్రాజెక్టులు మంత్రి అప్పలరాజు శాశ్వత పథకాలన్నారు. గౌతు కుటుంబం 60 ఏళ్ల పాలన లో ఉద్దానం ప్రాంతం ఓట్లు కొల్లగొట్టారు తప్ప ఈ ప్రాంతంలో శాశ్వత ప్రాజెక్టు ఏమైనా తీసుకొచ్చారని ప్రశ్నించారు. మంత్రి అప్పలరాజు వ్యక్తి కాదు శక్తి అన్నారు. మంత్రి అప్పలరాజును విమర్శించే స్థాయి, అర్హత శిరీషకు లేదన్నారు. స్కిల్ డెవలప్‌మెంట్ స్కాంలో అడ్డంగా దొరికిపోయిన చంద్రబాబు మెడికల్ కోసం నాలుగు వారాలు మధ్యంతర బెయిల్ పై వస్తే టీడీపీ బాణసంచా సంబరాలు ఏమిటో అని ఎద్దేవా చేసారు. దోపిడీ దారుడు బెయిల్ పై వస్తే సంబరాలు ఎందుకు అని ప్రశ్నించారు. ఎప్పుడు ఎన్నికలు జరిగినా వైసీపీ 175 కు 175 స్థానాలు గెలుచుకుంటుంది అని ధీమా వ్యక్తం చేశారు. ప్రభుత్వం అమల చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలే వైసీపీ గెలుపు మంత్రం అన్నారు. ఈ సమావేశంలో వైసీపీ నాయకులు అట్టాడ గోపి, బాలక శ్రీను, తుంగాన సుశీల, కొల్లి జోగారావు, శశిభూషణ్, లోకనాథం, దాలయ్య, జల్లు ఉషారాణిలు పాల్గొన్నారు.

కోచ్‌లకు సన్మానం

విశాలాంధ్ర-పలాస : షటిల్ బ్యాట్మింటన్ క్రీడలో శిక్షణ ఇస్తూ ఎంతో మందిని ఉన్నత క్రీడాకారులుగా తీర్చిదిద్దిన కోచ్ లకు బుధవారం సన్మానించారు. సీనియర్ షటిల్ బ్యాట్మింటిన్ క్రీడాకారుడు చల్లా రమేష్ కుమారుడు చల్లా రేవంత్ అండర్ 17 బాలుర విభాగంలో స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా(శాప్, యానాం) కు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా చల్లా రేవంత్ ఎంపిక కావడానికి ఎంతో కృషి చేసి శిక్షణలలో ఎన్నో మెలుకువలు నేర్పించి రేవంత్ విజయానికి కారుకులైన శిక్షకులు ఎం.మల్లిఖార్జునరావు (మల్లి), షేక్మహ్మద్(మున్నా)లకు స్థానిక రైల్వే ఇన్స్టిట్యూట్లో కౌన్సిలర్ గుజ్జు జోగారావు ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో రైల్వే ఇన్స్టిట్యూట్ కార్యదర్శి రెడ్డి, చల్లా రమేష్, కిరణ్ కుమార్, పిడి తవిటయ్య, సోము. మాధవ్, శ్రీకాంత్. ఇన్స్టిట్యూట్లో శిక్షణ పొందుతున్న క్రీడాకారులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

చంద్రబాబు నాయుడుతోనే రాష్ట్ర భవిష్యత్తుకు గ్యారెంటీ

నియోజకవర్గ టీడీపీ ఇంఛార్జ్ కోళ్ల లలిత కుమారి

విశాలాంధ్ర-శృంగవరపుకోట : టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడుతోనే రాష్ట్ర భవిష్యత్తుకి గ్యారెంటీ అని నియోజకవర్గ ఇంచార్జ్, మాజీ ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి అన్నారు. శృంగవరపుకోటలోని పెద్దవీధిలో 5వ యూనిట్ ఇంఛార్జ్ నానిగిరి రమణాజీ, 27వ బూత్ కన్వీనర్ వసంత సత్యారావు ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీ జాతీయ కార్యదర్శి నారా లోకేష్ బాబు ఆదేశాలు మేరకు 'బాబు ష్యూరిటి భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి బుధవారం రాత్రి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా ప్రజలకు సూపర్ సిక్స్ మినీ మేనిఫెస్టో పథకాల గురించి ఇంటింటికి వెళ్లి భవిష్యత్తుకు గ్యారెంటీ కరపత్రాలను పంచుతూ వివరించారు. ఈ సందర్భంగా ప్రజా వేదిక నుండి ఆమె మాట్లాడుతూ చంద్రబాబు నాయుడుపై అక్రమ కేసులు పెట్టి 53 రోజులు తరువాత బయటకు రావడం పార్టీ అభిమానులకు ఆనందాన్ని కలిగిస్తుందన్నారు. అయినప్పటికీ జగన్మోహన్ రెడ్డిని ఇంటికి పరిమితం అయ్యేలా పని చేయాలని పార్టీ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. రాష్ట్రంలో జరుగుతున్న నియంత పాలనపై నియోజకవర్గంలో ఉన్న రాష్ట్ర స్థాయి నుండి గ్రామ బూత్ స్థాయి వరకు వివిధ హెూదాల్లో ఉన్న తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు అందరూ సమిష్టిగా పనిచేసి ప్రజలకు వివరించాలని సూచించారు. అదేవిధంగా క్లస్టర్, యూనిట్, బూత్ కన్వీనర్ల పరిధిలో ఉన్న ఓటరు జాబితాలను పరిశీలించి దొంగ ఓట్లను గుర్తించాలని, టీడీపీ సానుభూతిపరుల ఓట్లను తొలగిస్తే, వాటిని మరల చేర్పించాలని సూచించారు. కొత్త ఓట్లపైన ప్రత్యేకంగా దృష్టి సారించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో శృంగవరపుకోట మండల పార్టీ అధ్యక్షులు జీ.ఎస్.నాయుడు, మాజీ వైస్ ఎంపీపీ నానిగిరి రమణాజీ, ఎస్.కోట పట్టణ పార్టీ అధ్యక్షులు కోనేదం మల్లేశ్వరరావు, క్లస్టర్ కోఆర్డినేటర్ విశాఖ టీడీపీ పార్లమెంటరీ కార్యనిర్వహక కార్యదర్శి కాపుగంటి శ్రీనివాసు, నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షులు వాకాడ బాల ఈశ్వర్ భరత్ (బాలు), బూత్ కన్వీనర్ వసంత సత్యారావు, మోపాడ చిన్నికృష్ణ, గనివాడ వెంకటరమణ, శ్రీను, గ్రామ పెద్దలు, రైతులు, తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బూటకపు ఎన్ కౌంటర్ పేరుతో హత్యలు చేస్తున్నారు

విశాలాంధ్ర-పలాస: కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజల కోసం ఉద్యమాలు చేస్తున్న వారిపై బూటకపు ఎన్ కౌంటర్ పేరుతో హత్యలు చేస్తున్నారని సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి వంకల మాధవరావు దుయ్యబట్టారు. ఈ నెల 1 నుండి 9 వరకు అమర వీరుల వారోత్సవ కార్యక్రమం నిర్వహించాలని పార్టీ ఇచ్చిన పిలుపుమేరకు ఆదివారం పలాసలో సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ కార్యాలయం ఆవరణలో అరుణ పతాకాన్ని సీనియర్ కమ్యూనిస్టు వంకల పాపయ్య ఆవిష్కరించారు. అనంతరం జరిగిన సభకు బైరి కూర్మారావు ఐఎఫ్‌టియు జిల్లా కోకన్వీనర్ అధ్యక్షత వహించారు. ఈసందర్బంగా ఆయన మాట్లాడుతూ నక్సల్బరీ శ్రీకాకుళ ఉద్యమం, గోదావరిలోయ ప్రతిఘటన పోరాటంలో వేలాదిమంది అమరుల య్యారని, వారు ఉన్నతమైన జీవితాలను ప్రజల కొరకు తృణప్రాయంగా అర్పించారని కొని యాడారు. భారత విప్లవోద్యమంలో అగ్ర నాయకులు చారుమజేందర్ చంద్రపుల్లారెడ్డి సత్యనారాయణ సింగ్, తరిమిల నాగిరెడ్డి, కొల్లా వెంకయ్య, మాదాల నారాయణస్వామి, పైలా వాసుదేవరావు ,పంచాది కృష్ణమూర్తి వెంపటాపు సత్యం, వంటి అగ్ర నాయకులు అమరులయ్యా రన్నారు కేంద్రంలో మోడీ అధికారంలోకి వచ్చాక అసహన రాజకీయాలు ఎక్కువయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. భిన్నభిప్రాయాలను సహించ లేకపోతున్నారని, రాజ్యాంగం మీద రాజ్యాంగం వ్యవస్థల మీద దాడి జరుగుతుందన్నారు. రాష్ట్రంలో జగన్ ప్రభుత్వం అధికారం చేపట్టిన నాలుగేళ్లు దాటిన అభివృద్ధి చేయడంలో జగన్ సర్కార్ విఫలమైందని ఆరోపించారు. విశాఖ ఉక్కును రక్షించడంలో ప్రాజెక్టులు పూర్తి చేయడంలో, ప్రత్యేక హెూదా సాధించడంలో, పరిశ్రమలు నెలకొల్పడంలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడంలో జగన్ పూర్తిగా విఫలమయ్యారని విమర్శించారు. కేంద్రం తీసు కొచ్చిన 2020 విద్యుత్ సంస్కరణల చట్టం స్మార్ట్ మీటర్లను శ్రీకాకుళం నుండే ప్రారంభించడం దౌర్భాగ్యమని విమర్శించారు. మోడీ ప్రజా వ్యతిరేక విధానాలకి జగన్ సర్కార్ కొమ్ముకాస్తుందన్నారు. దోపిడీ పీడన అసమానతలు లేని నూతన సమాజం రావాలంటే అందుకు విప్లవం ఒకటే మార్గమన్నారు. అటువైపుగా ప్రయాణం చేయా ల్సిన అవసరం ఉందని అమరలు చూపిన బాటలో నడవాలని వారు ఆశయాల పతాకాన్ని సమనొత్తంగా నిలబెట్టాలని మాధవరావు కార్యకర్తలను కోరారు. ఈ సభలో అరుణోదయ సాంస్కృతిక సమైక్య జిల్లా కార్యదర్శి కొసింటి సోమేశ్వరరావు, ప్రగతిశీల మహిళా సంఘం (పిఓడబ్ల్యూ) జిల్లా అధ్యక్షురాలు బదకల ఈశ్వరమ్మ, ఏఐకేఎంఎస్ నాయకులు మామిడి భీమారావు, సవర సోమేశ్వరరావు, ఆదివాసి సంఘం నాయకులు, సవర బంగ్లా కుమార్, పిఓడబ్ల్యు నాయకురాలు సరస్వతి, ప్రగతిశీల యువజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు సోమేశ్వరరావు, పిడిఎస్యుయు రాష్ట్ర ఉపాధ్యక్షులు మద్దిల. వినోద్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు బెయిల్‌పై తెలుగు తమ్ముళ్ల సంబరాలు

విశాలాంధ్ర-జామి : తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబునాయుడుకు మధ్యంతర బెయిల్ రావడం పై జామి మండల తెలుగుదేశం పార్టీ సంతోషం వ్యక్తం చేసింది బుధవారం సాయంత్రం మండల కేంద్రమైన జామిలో పుర వీధిల్లో భారీ ర్యాలీ నిర్వహించారు. మాజీ జడ్పిటిసి బండారు పెద్దబాబు, మండల టిడిపి అధ్యక్షుడు పోలువర్తి స్వామి నాయుడు, ప్రధాన కార్యదర్శులు వర్రీ రమణ, ధనియాల పైడిరాజుల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ర్యాలీకి భారీ సంఖ్యలో తెలుగు తమ్ముళ్లు హాజరయ్యారు. ముందుగా స్థానిక బస్టాండ్లో బాణసంచా కాల్చి తమ సంతోషాన్ని వ్యక్తం చేశారు. అనంతరం ర్యాలీలో పాల్గొన్న తెలుగు తమ్ముళ్లు సైకో పోవాలి, సైకిల్ రావాలి అంటూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ పార్లమెంటరీ విభాగ నాయకులు మాకిరెడ్డి శ్రీలక్ష్మి, కొత్తలి సూర్యరావు, ముకుంద శ్రీను,తెలుగు యువత నాయకులు బండారు

బిఆర్‌ఏయూలో బోదన సిబ్బంది పోస్టుల భర్తీకి దరఖాస్తుల స్వీకరణ

విశాలాంధ్ర-ఎచ్చర్ల : డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ యూనివర్సిటీలో 13 విభాగాల్లో 99 బోధన సిబ్బంది పోస్టుల భర్తీకి దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ ప్రారంభమైందని విసి ప్రొఫెసర్ నిమ్మ వెంకటరావు తెలిపారు. ఆయన బుధవారం తన ఛాంబర్‌లో మాట్లాడుతూ సహాయ, అసోసియేట్, ప్రొఫెసర్ కేటగిరీల్లో రిజర్వేషన్లు, సబ్జెక్టులు, అర్హతలు వాటికి కేటాయించే మార్కుల వివరాలు వర్సిటీ వెబ్సైట్లో అందుబాటులో ఉంచామన్నారు. రాష్ట్రం యూనిట్‌గా తీసుకొని ఈ ప్రక్రియ జరుగుతుందని చెప్పారు. దరఖాస్తు చేయాలనుకున్న అభ్యర్థి వర్సిటీ వెబ్సైట్ను పరిశీలించి తన రిజర్వేషన్లను నమోదు చేస్తే ఏపి యూనివర్సిటీలో తన కేటగిరీకి సంబంధించిన ఉద్యోగాలు ఉన్నాయన్న విషయం తెలుస్తుంది అన్నారు. ఈనెల 27వ తేదీలోగా అభ్యర్థులు ఆన్లైన్లో దరఖాస్తు చేసుకొని ఆ తర్వాత వారం రోజుల్లోగా జిరాక్స్ కాపీలను వర్సిటీకి అందజేయాలన్నారు. అభ్యర్థులకు ఎలాంటి సమస్య వచ్చినా గ్రీవెన్స్ స్వీకరించి పరిష్కరిస్తామన్నారు. అసిస్టెంట్ ప్రొఫెసర్ ఉద్యోగానికి స్క్రీనింగ్ పరీక్ష నిర్వహించి మెరిట్ ఆధారంగా ఇంటర్వ్యూలు నిర్వహించి నియామకాలు చేపడతామన్నారు. స్క్రీనింగ్ పరీక్షలో 150 ప్రశ్నలు ఉంటాయని ఒక్కో ప్రశ్నకు మూడు మార్కులు వంతున 450 మార్కులకు పరీక్ష జరుగుతుందని చెప్పారు. ఒక్కో తప్పుకు ఒకటి చెప్పున మైనస్ ఉంటాయన్నారు.

ఘనంగా ఉర్స్ ఉత్సవం

విశాలాంధ్ర-ఇచ్ఛాపురం : స్థానిక హజరత్ యూసఫ్ షా ఉర్సు ఉత్సవాన్ని బుధవారం తకియా దర్గా కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. దర్గా అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో వేకువ ఝామున మసీదు శుద్ధి చేసి ప్రార్ధనలు నిర్వహించారు. సాయంత్రం పతాకాన్ని ఆవిష్కరించి ఫకీర్‌పేట మీదుగా పాత బస్టాండ్‌ల మీదుగా ఊరేగింపు జరిపారు. మత ప్రచారకుని సమాది వద్ద రోజంతా ప్రార్ధనలు చేసిన ముస్లింలు రాత్రి బోజనాలు చేసారు. మత ప్రచారకుని శాంతి కోసం చందన లేవనం జరిపారు. స్థానిక ముస్లింలు దర్గా పరిరక్షణ కమిటీ అధ్యక్షుడు అబ్దుల్లా ఆధ్వర్యంలో పవిత్రంగా నిర్వహించిన కార్యక్రమానికి ఎమ్మెల్యే డాక్టర్ బెందాళం అశోక్ తన అనుచరులు ఎమ్డీ జిలానీ, నందిక జానకిరావు, కాళ్ళ దిలీప్, ఆశి లీలారాణి తదితరులతో కలిసి హాజరై ప్రార్ధనల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సే నర్తు రామారావు పరపటి కోటి, పిలక సంతోష్ తదితర తన అనుచరులతో కలిసి ఉదయం దర్గాను సందర్శించి ప్రార్ధనల్లో పాల్గొన్నారు. స్థానిక ముస్లిం సంఘానికి చెందిన జోహర్‌ఖాన్, పర్వేజ్, అలీంఖాన్ తదితరులు పాల్గొన్నారు.